# నినాదం


నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 05 జనవరి 2025 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 8


## మీ సేవలు అజరామరం



2



# రైతు భరోసాపై.. ప్రభుత్వం ఫోకస్.?

- పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలానికి ఓ గ్రామం ఎంపిక...
- ఈ నెల 8 వరకు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం
- సూర్యాపేట జిల్లాలోని 23 మండలాల్లో కొనసాగనున్న సర్వే
- ప్రతీ మండలంలో ఒక గ్రామం ఎంపిక
- ఆయా గ్రామాల్లో 400 నుంచి 500 ఎకరాల్లో పంటల పరిశీలన

**కోదాడ, జనవరి 4(నినాదం న్యూస్):** రైతుభరోసా పథకం అమలులో భాగంగా మండలానికో గ్రామంలో సాగవుతున్న పంటలను నమోదు(క్రాప్ బుకింగ్) చేయించాలని, దానిని శాటిలైట్ సర్వేతో పోల్చి చూడాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మండల వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో విస్తరణాధికారులు పంటలను నమోదు చేయనున్నారు. పంటలు సాగు చేసే రైతులకే రైతుభరోసా పథకం అమలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. పంట సాగు నిర్ధారణకు శాటిలైట్ సర్వేను ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తోంది. శాటిలైట్ సర్వే కచ్చితత్వంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో దానిని పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పంటలను నమోదు చేయించి సరిచూడాలని నిర్ణయం తీసుకుంది. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని గుర్తించాలని, వాటిల్లో 400-500 ఎకరాల్లో ఏఈవోలతో పంటలను క్రాప్బుకింగ్ అప్లికేషన్లో నమోదు చేయాలని వ్యవసాయశాఖ సూచించింది.ఈనెల 8వ తేదీ నాటికి పంటల నమోదు పూర్తిచేసి, 9న హైదరాబాద్లోని ప్రధాన కార్యాలయానికి పంపాలంది. 520 గ్రామీణ మండలాల నుంచి వచ్చే నివేదికలను వ్యవసాయశాఖ శాటిలైట్ సర్వే నివేదికలతో పోల్చి చూస్తారు. అనంతరం ఈనెల 10 లేదా 11 తేదీల్లో ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిస్తుంది.. ఓ వైపు పంటల సర్వే చేయిస్తున్న ప్రభుత్వం మరో వైపు 5, 6, 7 తేదీల్లో గ్రామసభలు నిర్వహించి రైతు భరోసా' దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించింది.

**23 మండలాల్లో ఒక్కో గ్రామం ఎంపిక**

సూర్యాపేట జిల్లాలో 23 మండలాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఒక్కో గ్రామాన్ని మొత్తం 23 గ్రామాలను ఇప్పటికే గుర్తించగా, శనివారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు పంటల నమోదు సర్వేను అధికారులు నిర్వహించనున్నారు. మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా

మిగతా2లో

## బీఎస్ఎన్ఎల్ బలోపేతానికి కృషి చేయాలి

### ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం, జనవరి04(నినాదం న్యూస్):** పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) సభ్యులుగా ఎంపికైన 8 మంది.. ఉమ్మినేని కృష్ణ, షేక్ ఇమామ్ సాహెబ్, యాస వెంకటేశ్వరరావు, పిల్లెల రామ లక్ష్మయ్య, బోదాసు కనకరాజు, అమరావాది

మిగతా2లో

## గ్రూప్ ఫోర్త్ ద్వారా జిల్లాలో 44 మంది ఎంపిక




వివరాలు 2లో

- నూతనంగా కొలువుల సాధించిన జూనియర్ అసిస్టెంట్లకు మండలాల్లో రెవిన్యూ కార్యాలయాలకు కేటాయింపు
- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

## ఆసియా ఓపెన్ టైక్వాండోలో.. సత్తాచాటిన సంజీవ్‌కుమార్

### అభినందించిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

2024 ఆసియా ఓపెన్ పోలీస్ థాయికాండో చాపల షిప్‌లో మన భారతదేశం తరపున బరిలో పాల్గొని మూడో స్థానంలో నిలిచిన వికారాబాద్ జిల్లా వాసి వృద్ధుల సంజీవ్‌కుమార్‌ను తెలంగాణ శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ అభినందించారు.



వివరాలు 2లో

NewsNinadam
newsninadam
ninandamtelugu
నినాదం

# మీ సేవలు అజరామరం

- డిడి ఎస్ వివిఎస్ నరసింహం
- సీనియర్ పెన్షనర్లకు సన్మానం

**ఖమ్మం, జనవరి04(నినాదం న్యూస్):** ఏళ్ల తరబడి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి సమాజంలో మార్పు కోసం ప్రయత్నించిన వారి సేవలు అజరామరమని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అర్విణి రాజేంద్రబాబు తెలిపారు. ఉద్యోగ బాధ్యత అంటే కేవలం అప్పగించిన పని చేయడమే కాదని సమాజ శ్రేయస్సు కోసం, మార్పు కోసం ప్రజల అవసరాలను గుర్తెరిగి పనిచేయడమని ఆయన తెలిపారు. శుక్రవారం రాత్రి ఖమ్మంజిల్లా ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రబాబు మాట్లాడుతూ సామాజిక సేవలో జీవితాన్ని వెచ్చించిన వారి పట్ల పాలకులు అనుసరిస్తున్న వైఖరి ఇబ్బందికరంగా ఉందన్నారు. పని చేస్తున్న కార్యాలయాన్ని కుటుంబంగా ఎంచుకుని పని చేసి పదవి విరమణ పొందిన తర్వాత ప్రభుత్వం నుంచి అందాల్సిన సదుపాయాలను కల్పించడంలో విఫలమవుతున్నారని రాజేంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో వయస్సు పైబడిన వారికి ఇబ్బందులు తలెత్తుతాయని అందరూ నగదు నిల్వతో ఉండరన్న వాస్తవాన్ని ఈ ప్రభుత్వం గుర్తెరగడం లేదన్నారు. నగదు రహిత వైద్య సాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అదే సమయంలో అప్పో సప్పో చేసి వైద్యం చేయించుకుంటే మెడికల్ రీయంబర్స్మెంట్ నెలలు గడిచినా రాకపోవడం వృద్ధాప్యంలో ఉన్న వారిని మనో వేదనకు గురి చేస్తుందన్నారు. పిఆర్సి, డిఏలను కూడా విడుదల చేసి పెన్షనర్లకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు. మొత్తం 35 మంది పెన్షనర్లకు సన్మానం చేశారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఖజానా అధికారి ఎస్ఎస్ నరసింహం, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి నర్సింగరావు, జిల్లా కార్యదర్శి రాయల రవికుమార్, అసోసియేషన్ బాధ్యులు కన్నెకంటి కృష్ణమూర్తి, ఐవి భాస్కరాచారి, కనపర్తి వెంకటేశ్వర్లు, ఊడుగు వెంకటేశ్వర్లు, బెల్లం రాధాకృష్ణమూర్తి, పెదమళ్ల సత్యనారాయణ, గుర్రాల శ్రీనివాసరావు, లక్ష్మి, లక్ష్మి సుజాత, కృష్ణకుమారి, మేరీ ఏసుపాదం, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాపై ప్రభుత్వం ఫోకస్.?

(మొదటిపేజీ తరువాయి..)

ఎంపిక చేసిన అధికారులు, ఆ గ్రామాల్లో 400 నుంచి 500 ఎకరాల వరకు పంటలను పరిశీలించి ప్రత్యేక యాప్లో నమోదు చేస్తారు. 400 నుంచి 500 ఎకరాల మధ్యలో ఏ ఒక్క సర్వే నంబర్ మిస్ కాకుండా పంట నమోదు సర్వేను పూర్తిచేస్తారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు, కలెక్టర్లు ఈ సర్వేపై క్షేత్రస్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వే బాధ్యతలను వ్యవసాయ విస్తరణాధికారులు చూడ నుండగా, మండల వ్యవసాయ అధికారులు పర్యవేక్షిం చనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేను 400 నుంచి 500ఎకరాల మధ్యలో సర్వేనంబర్లు బ్రేక్ కాకుండా ఏ పంటలు వేశారనే దాన్ని క్షుణ్ణంగా పరిశీ లించి యాప్ లో పకడ్బందీగా నమోదుచేయనున్నారు.

**పూర్తిస్థాయి సర్వేకు సమయం లేకే...**

రైతు భరోసా'పై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. అయితే ఎలాంటి ఆంక్షలు లేకుండా నగదు చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతున్నా మార్గదర్శకాలు విడుదలచేస్తేనే స్పష్టత వస్తుంది. 5, 6, 7 తేదీల్లో రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని, వారు సాగుచేస్తున్న పంటల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వం, మరోవైపు పంటల సర్వేను పూర్తిస్థాయిలో కాకుండా పైలెట్ ప్రాజెక్టుగా గ్రామాలను ఎంపిక చేయడం గమనార్హం. దీంతో 'రైతుభరోసా' కోసమే పంటల సర్వే చేస్తున్నారనే చర్చ సాగుతోంది. సంకాంత్రి పండుగ నుంచే రైతు భరోసా నగదు జమచేస్తామని చెబుతు న్నందున పూర్తిస్థాయి సర్వే ఈ కొద్ది సమయంలో చేపట్టే అవకాశాలు లేకపోవడంతో రైతు భరోసా' విష యంలో ప్రభుత్వం కచ్చితంగా ఉందనే విషయం రైతు లకు తెలియజేసేందుకే పైలెట్ ప్రాజెక్టుగా గ్రామాలను ఎంపిక చేసినట్టు చర్చ నడుస్తోంది. పంటలు సాగుచేసిన భూముల సర్వే నెంబర్ వివరాలను గ్రామ సభల్లో కచ్చితంగా ఇవ్వాలనే నిబంధన పెట్టింది. అదేసమయంలో పంటల సర్వేను చేపట్టనుండటంతో ' సాగులో లేని భూములకు 'రైతు భరోసా' ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసేందుకే ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

# ఆసియా ఓపెన్ టైక్వాండోలో సత్తాచాటిన సంజీవ్‌కుమార్

- అభినందించిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్



**వికారాబాద్, జనవరి 04(నినాదం న్యూస్):** 2024 ఆసియా ఓపెన్ పోలీస్ థాయికాండో చాపల షిప్‌లో మన భారతదేశం తరపున బరిలో పాల్గొని మూడో స్థానంలో నిలిచిన వికారాబాద్ జిల్లా వాసి వృద్ధుల సంజీవ్‌కుమార్ ను తెలంగాణ శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ అభినందించారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలోని వియత్నం 2024 ఆసియా ఓపెన్ పోలీస్ టైఖండో ఛాంపియన్‌షిప్లో మన భారతదేశం తరపున పాల్గొని మూడో స్థానంలో నిలిచిన వికారాబాద్ జిల్లా, పరిగి మండలం, సోమన్ గుర్తి గ్రామానికి చెందిన దుద్యాల చెన్నయ్య, మంజుల కుమారుడు రాచకొండ కమిషనరేట్ లో కానిస్టేబుల్ దుద్యాల సంజీవ్ కుమార్ ను గౌరవ తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ అభినందించారు. అనంతరం తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ మన దేశం తరపున టైక్వాండో పోటీలో మూడో స్థానం సాధించినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ముందు ముందు ఇంకా ఎన్నో విజయాలను సాధించాలని అన్నారు. క్రీడాకారుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. అదేవిధంగా గెలుపొందిన దుద్యాల సంజీవ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే భవిష్యత్తులో కూడా దేశ విదేశాలు నిర్వహించే టైక్వాండో పోటీలో గెలిచి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొస్తానని హర్షం వ్యక్తం చేశారు.

# బీఎస్ఎన్ఎల్ బలోపేతానికి కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి..)

సత్య నారాయణ రెడ్డి, బానోత్ రంజిత్ లకు నియామక పత్రాలను ఎంపీ అందజేశారు. నగరంలోని గట్టయ్య సెంటర్లో గల క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులందరికీ ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ రీజియన్ లో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధి ఉంటుందని అన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులందరూ.. గ్రామీణ స్థాయిలో బీఎస్ఎన్ఎల్ విస్తరణకు, సంస్థ బలోపేతానికి విశేష కృషి చేయాలని అన్నారు. కేంద్ర కమ్యూనికేషన్స్, ఐటీ స్టాండింగ్ కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నానని.. మన రీజియన్ పరిధిలో బీఎస్ఎన్ఎల్ సంస్థ విస్తరణకు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని..అభయామిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా రాంబాబు, కాంగ్రెస్ జిల్లా నాయకులు బెల్లం శ్రీను, కొప్పుల చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ గోసు మధు, నాయకులు దొడ్డా నగేష్, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, ఉత్తేజ్ నాయక్, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రూప్ ఫోర్త్ ద్వారా జిల్లాలో 44 మంది ఎంపిక






**మెదక్ ప్రతినిధి, జనవరి 4 (నినాదం న్యూస్):** ఉద్యోగం పెద్దదా చిన్నదా అనేది కాదు బాధ్యతగా క్రమశిక్షణగా, విధి నిర్వహణ కర్తవ్యం గా భావించాలని అదనపు కలెక్టర్ కలెక్టర్ నగేష్ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగులకు సూచించారు. శనివారం సమీకృత కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రూప్ -04 ద్వారా జిల్లాలో 44 మంది యువత జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగులుగా ఎంపిక కావడం విధి నిర్వహణపై వర్క్ షాప్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఉద్యోగం సాధించడం చాలా గొప్ప విషయమని తొందరలో వీరందరికీ ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు అన్ని మండలాల రెవిన్యూ కార్యాలయాలకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగులుగా కేటాయించడం జరుగుతుందని వివరించారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగం సంపాదించడం, జిల్లాలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అత్యంత చేరువలో మీ పాత్ర చాలా ముఖ్యమైందని అన్నారు. రెండే రెండు శాఖల ఒకటి రెవిన్యూ, రెండో వరుసలో పోలీస్ శాఖ అత్యంత కీలకంగా ఉండబోతాయని ఇందులో ప్రజలకు అవసరాల నిమిత్తం రెవెన్యూ శాఖ అత్యంత కీలకంగా ఉంటే , న్యాయపరమైన సమస్యలు భద్రతా చర్యలు పోలీస్ శాఖ సమకూర్చుందని వివరించారు. జూనియర్ అసిస్టెంట్లుగా కొలువులు సాధించి భవిష్యత్తులో మీకున్న విద్యా అర్హతలతో పదోన్నతులు సాధించి మీరు చేస్తున్న శాఖకు, వృత్తికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అంతకుముందు వికారాబాద్ రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ సురేష్ పోత్ ధార్ రెవిన్యూ చట్టాలు, ఆర్టిఐ యాక్ట్, సర్వీస్ మేటర్స్, బాధ్యతగా కొలువుల నిర్వహణ సంబంధిత అంశాలపై జిల్లాలో గ్రూప్ ఫోర్త్ పరీక్షల ద్వారా ఎంపికైన 44 మంది జూనియర్ అసిస్టెంట్ అభ్యర్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి భుజంగరావు, కలెక్టరేట్ ఏవో యునస్, తాసిల్దార్, శ్రీనివాస చారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు
- జిల్లా హెడ్ క్వార్టర్‌లో పిల్లలచే రోడ్డు భద్రతా ప్రమాణాల పై భారీ ర్యాలీ
- గురుకులాలో పిల్లలకు అందించే ఆహార నాణ్యత పై తనిఖీలు నిర్వహించాలి
- రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- రాష్ట్ర బీసీ,రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




**పెద్దపల్లి,జనవరి 04 (నినాదం) :** ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాల పై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ తో కలిసి రోడ్డు భద్రత వారోత్సవాల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, డి.వేణులతో కలిసి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని రొడ్డు భద్రతా వారోత్సవం చేపడుతుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ వినూత్నంగా ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.రోడ్డు భద్రత ప్రమాణాల పై వేడుకలను ప్రతి గ్రామంలో జరగాలని,పిల్లల్లో రొడ్డు భద్రతా ప్రమాణాల పై అవగాహన కల్పించేందుకు ప్రైవేట్,ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులచే ప్రతి జిల్లా,మండల హెడ్ క్వార్టర్ లో భారీ ర్యాలీ చేపట్టాలని అన్నారు.ఆర్%డ% బీ, మరియు పంచాయతీ రాజ్ శాఖ తమ పరిధిలో రొడ్డు భద్రతా ప్రమాణాల కార్యక్రమాలు జరగాలని అన్నారు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ, రొడ్డు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు భద్రత కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు.భారీ తుఫాన్లు, వరదలు, తదితర వాటి వల్ల పోయే ప్రాణాల కంటే ప్రమాదంలో అధికంగా ప్రాణాలు కోల్పోతున్నామని,రొడ్డు ప్రమాదాల నియంత్రణకు మనమంతా కలిసి పని చేయాలని, రోడ్డు భద్రతా ప్రమాణాలను పిల్లల సిలబస్ లో కూడా పెట్టెలా చూస్తామని అన్నారు.రోడ్డు భద్రత నియమాలను పాటించని వారి లైసెన్స్ రద్దు చేసి భవిష్యత్తులో జారీ చేసేందుకు వీలు లేకుండా సాఫ్ట్వేర్ రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని, ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని అన్నారు.
రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలకు విస్తృత ప్రచారం ఉండాలని,స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు.రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన కార్యక్రమాల్లో హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ వినియోగించేలా ప్రోత్సహిస్తూ కొంతమందికి హెల్మెట్ పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.
రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రతా కార్యక్రమాలను ముందుండి నిర్వహించాలని, పాఠశాలలో రోడ్డు భద్రత ప్రమాణాలపై పోటీ పరీక్షలు నిర్వహించాలని అన్నారు.
రెసిడెన్షియల్ పాఠశాలలో పిల్లలకు మెస్ చార్జీలు పెంచామని, వారికి రుచికరమైన నాణ్యమైన ఆహారం అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.పిల్లలకు అందించే ఆహర నాణ్యతను కలెక్టర్లు , ఉన్నతాధికారులు తనిఖీ చేయాలని, ఆహర సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు త్వరగా చెల్లిస్తున్నామని , నాణ్యత అంశంలో ఎక్కడ రాజీ ఉండవద్దని అన్నారు.రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మాట్లాడుతూ ఈనెల మొత్తం రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు తెలిపారు. ప్రస్తుత సమాజంలో జరిగే రొడ్డు ప్రమాదాలలో 75% డ్రైవర్ తప్పిదం వలన జరుగుతున్నాయని అన్నారు.రాష్ట్రంలోని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాల్సిన నియమ నిబంధనల పై అవగాహన కల్పించాలని అన్నారు.రోడ్ల పై ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ ఏ ఆసుపత్రికి తీసుకుని రావాలి ఒక ప్రణాళిక ఉండాలని, దిని పై అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రతి జిల్లా స్థాయిలో ఉన్న రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, ఆక్సిడెంట్ ఏరియా గుర్తించాలని, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రతి పాఠశాల పరిసరాలలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని, పాఠశాలల్లో విద్యార్థులకు చిన్నతనం నుంచి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై లోకల్ ఎఫ్ఎం రేడియో, కేబుల్ చానల్స్ లో టెలికాస్ట్ అయ్యేలా చూడాలని అన్నారు.ఈ సమావేశంలో డిసిపి ఎం.చేతన,రవాణా శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# జర్నలిస్టు ముఖేష్ చంద్రాకర్ హత్యని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి (నినాదం) :** సీనియర్ జర్నలిస్టు ముఖేష్ చంద్రాకర్ హంతకులను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల జర్నలిస్టు జెఏసీ డిమాండ్ చేసింది. జర్నలిస్టు ఆత్మకి శాంతి కలగాలని కోరుతూ నల్లబ్యాడ్జీలు పెట్టుకొని చర్లలో శనివారం రాత్రి జర్నలిస్టులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ సెంటర్, గాంధీ సెంటర్, పోలీస్ స్టేషన్ సెంటర్‌ల మీదుగా తిరిగి అంబేద్కర్ సెంటర్ వరకు జరిగింది. జోహార్ జర్నలిస్టు ముఖేష్ చంద్రాకర్.. ఖబడ్దార్ జర్నలిస్టు హంతకులారా.. జర్నలిస్టు హంతకులను వెంటనే అరెస్టు చేయాలి.. హంతకులను కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.. జర్నలిస్టులకు పాలక ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి.. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి.. అని పెద్దపెట్టున జర్నలిస్టులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చర్ల సీనియర్ జర్నలిస్టులు దొడ్డా ప్రభుదాస్ (సాక్షి టీవీ), గడ్డం మణికుమార్ (ఆంధ్రజ్యోతి), తోటమల్ల రమణమూర్తి (ఆంధ్రప్రభ), తదితరులు మాట్లాడుతూ చత్తీస్‌గఢ్ జర్నలిస్టులకు, చెర్ల జర్నలిస్టులకు నడుమ వార్తల సమాచారం ఇచ్చిపుచ్చుకునే విషయంలో చాలా మంచి సంబంధాలు ఉన్నాయని, రాష్ట్రాలు వేరైనా వార్తల విషయంలో తామంతా ఒక్కటే అనే భావనతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ముఖేష్ చంద్రాకర్‌కి చర్ల జర్నలిస్టులతో సత్సంబంధాలు ఉన్నాయని, రాజీలేని ధోరణితో వార్తలను పబ్లిష్ చేయడంలో ముఖేష్‌కి సాటి మరొకరులేరని, నికార్సైన జర్నలిజానికి నిలువెత్తు సాక్ష్యం ముఖేష్ చంద్రకర్ అని, అది జీర్ణించుకోలేకనే కసితో ముఖేష్‌ని దుర్మార్గులు హత్య చేసినట్లుగా తేటతెల్లమౌతోందని అన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వెంటనే చంద్రాకర్‌ని చంపిన వారిని అరెస్టుచేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించి ఇలాంటి దుర్మార్గాలకు చోటులేకుండా జర్నలిస్టులకు పాలక ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో సీనియర్ జర్నలిస్టులు కొంగూరు రమణారావు, చిట్టిమల్ల శేషగిరి, జె. మురళి, యడెళ్ళ గణపతి, కొప్పుల రాంబాబు, మహబూబ్, బోళ్ళ వినోద్, చారి బ్రదర్స్, లక్ష్మణ్, సందీప్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..

## ఉత్తమ ప్రతిభ సాధించిన ట్రీనిటి విద్యార్థులు



**చౌటుప్పల్, జనవరి4 (నినాదంన్యూస్):** తెలంగాణ రాష్ట్ర సోషల్ ఫోరం, గాంధీ గ్లోబల్ ట్రస్ట్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ నిర్వహించిన జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పాఠవ పరీక్ష పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీ పరీక్షలలో ట్రినిటి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించారు. ప్రథమ స్థానంలో ఎ.మనోజ్, ద్వితీయ స్థాయిలో జి.వివేకాదిత్య,ఆర్. ఆదిత్య, తృతీయ స్థాయిలో కె. అక్షర, వై.భవ్యశ్రీ, ఎస్. లాస్య శ్రీ, కె. ప్రణీత్, ఎన్. పూర్ణచంద్రా లను జ్ఞాపికలు ప్రశంసా పత్రాలను అందించారు. అన్ని సబ్జెక్టుల్లో ప్రతిభ చూపి, భవిష్యత్తులో సివిల్స్, గ్రూప్ పరీక్షలకు పదవ తరగతి విద్యార్థులను ఈ పరీక్ష యొక్క ముఖ్య ఉద్దేశమని గాంధీ గ్లోబల్ ట్రస్ట్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ కం ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల ,చైర్మన్ కె వి బి కృష్ణారావు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

**- మండల విద్యాధికారి ఎల్ పురందాస్**

**- టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ**

**చేవెళ్ల జనవరి 04(నినాదం న్యూస్):** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన, గుణాత్మకమైన విద్యను అందిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎల్ పురం దాస్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చేవెళ్ల మండల శాఖ యొక్క నూతన సంవత్సర క్యాలెండర్ను చేవెళ్ల మండల విద్యాధికారి ఎల్ పురందాస్ జిల్లా కార్యదర్శి మహ్మద్ అక్బర్ తో కలిసి ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎల్ పురందాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి అనుభవం కలిగిన విషయ నిపుణులు ఉన్నారని, వారి ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి పేద పిల్లలకు గుణాత్మక విద్య అందించడం సాధ్యమవుతుందని అన్నారు. కాబట్టి మండలంలోని ఉపాధ్యాయులందరూ తమ పాఠశాలలోని విద్యార్థులను ఉత్తమములుగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి మహమ్మద్ అక్బర్ మాట్లాడుతూ తమ సంఘం హక్కుల కోసం ఎంతగానైతే పోరాడుతుందో, అంతే బాధ్యతతో కూడా పనిచేయాలని సూచిస్తుందని తెలిపారు. తమ సంఘంలోని ఉపాధ్యాయులు అందరూ ఎంతో క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా పనిచేస్తూ పాఠశాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లడంలో ముందు ఉంటారని వారి కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పడాల ప్రవీణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కిరణ్ మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, కోశాధికారి చాకలి కృష్ణ, మండల బాధ్యులు వీరయ్య, యాదగిరి, మధుకర్,పాండ్యా, అక్షయ్, పావనీలత,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తకొండ జాతర పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం



**భీమదేవరపల్లి జనవరి 4 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని సుప్రసిద్ధ కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర జనవరి 10 నుండి 18 వరకు జరగనున్నాయి. వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను శనివారం రోజు హుస్నాబాద్ స్థానిక ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా మినిస్టర్ అధికారిక నివాసం నందు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తకొండ దేవాలయ కార్యనిర్వహణ అధికారి పి కిషన్ రావు, అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు కాంచనపల్లి రాజయ్య, ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు, గుడ్ల శ్రీకాంత్, అర్చకులు వినయ్ శర్మ, సందీప్ శర్మ,శరత్ చంద్ర, శివకుమార్, సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ఖర్చుతో ఉత్తమ ఫలితాల కోసం అపోలో డయాగ్నొస్టిక్ సెంటర్ : కేఎం ప్రతాప్



**కుత్బుల్లాపూర్, జనవరి 4 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అయోధ్య నగర్ లో నూతనంగా అపోలో డయాగ్నస్టిక్స్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ఈ డయాగ్నిక్ సెంటర్ ప్రారంభోత్సవానికి రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా కె ఎం ప్రతాప్ మాట్లాడుతూ, నిరుపేదలు నివసించే ప్రాంతంలో, అతి తక్కువ ధరలతో ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా డయాగ్నస్టిక్ సెంటర్ ను నెలకొల్పినందుకు ప్రొప్రైటర్ కళ్యాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అయోధ్య నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు మాద రమేష్, బిజిలి శంకర్, వీరస్వామి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు గార శ్రీనివాస్, సుభాష్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బిజిలి కృష్ణ, శరభయ్య, లక్ష్మణ్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో చేతివాటంపై విచారణ

**- టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్‌కు కలెక్టర్ ఉత్తర్వులు**

**మహాముత్తారం జనవరి4 (నినాదం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో సిబ్బంది చేతివాటంపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించి విచారణ చేపట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం దౌతుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపట్టిన సిబ్బంది నిరుపేదల నుంచి సర్వే వివరాల మాటున ఇంటికి రూ.500ల చొప్పున వసూలు ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శనివారం మండల స్పెషల్ అధికారి వెంకటేశ్వర్లు దౌతుపల్లి గ్రామంలో విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు.



# వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- **మునుగోడు నియోజకవర్గంలో ఇటీవల మళ్లీ ఫ్లోరైడ్ జాడలు బయట పడుతున్నాయి**
- **నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి**
- **మిషన్ భగీరథ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**



**చౌటుప్పల్, జనవరి4 (నినాదంన్యూస్):** రాబోయే వేసవి కాలంలో ఎటువంటి తాగునీటి సమస్య లేకుండా చూడాలని... ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి రాకుండా ఇప్పటినుండే ప్రణాళిక రూపొందించుకోవాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడులోని తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో మునుగోడు నియోజకవర్గం లో మళ్లీ ఫ్లోరైడ్ జాడలు బయటపడుతున్నాయని ,నాణ్యమైన త్రాగునీరు అందించడానికి ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులని ఆదేశించారు. రోజురోజుకు మునిసిపాలిటీలలో పట్టణీకరణ పెరిగిపోతుందని పెరిగిన పట్టణీకరణకు అనుగుణంగా తాగునీటి సరఫరా అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చినప్పటికీ ప్రైవేటు ఆర్ ఓ ఆర్ ప్లాంట్ల నుండి ప్రజలు నీటిని కొనుగోలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాల నుండి గ్రామాలలో ఉన్న ఓవర్ హెడ్ నీటి ట్యాంకుల వరకు నీటి సరఫరా విషయంలో తలెత్తుతున్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని, గ్రామాలలోని నీటి ట్యాంకుల నుండి ప్రతి ఇంటికి వెళ్లే అంతర్గత పైపులైన్ల పెండిరగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాబోయే కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సరఫరా చేసే నీటి సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. గ్రామాలలోని బోరు నీళ్లు ,మిషన్ భగీరథ నీళ్లు కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంపుల సామర్థ్యం, నీటి సరఫరా సామర్థ్యం పెంచడానికి కావలసిన నిధులను అనుమతులను తాను తీసుకొస్తానని హామీ ఇచ్చారు. రాబోయే కాలంలో ప్రతి ఇంటికి నాణ్యమైన శుద్ధిచేసిన మిషన్ భగీరథ నీటిని అందించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో నల్గొండ జిల్లా ఆరడబ్ల్యూఎస్ సీఈ వెంకటేశ్వర్లు, యాదాద్రి జిల్లా ఎస్ఈ కృష్ణయ్య, చౌటుప్పల్ ఈఈ లక్ష్మీనారాయణ, భువనగిరి ఈఈ కరుణాకర్, నల్గొండ ఈ ఈ శాంతి కుమారి, డి ఈ లు ఏఈలు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలి

**- సర్వే ప్రగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అత్యంత పారదర్శకంగా నిర్వహించి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పురోగతిని అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు లతో కలసి ఆయన సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చేందుకు మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, ఇప్పటి వరకు సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వివరాల గురించి అధికారులతో తెలుసుకున్నారు. వివరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. తక్కువగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే నమోదులో వెనుకంజలో ఉన్న మండలాల ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని గ్రామస్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. పీఎం ఆవాస్ యాప్‌లో సర్వేయర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరించి ఇందిరమ్మ యాప్‌లో లాగిన్ అయ్యి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు.

**ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్ష...**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరు క్లస్టర్ల వారిగా పని దినాలు, చేపడుతున్న పనులు, తదితర అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ, మండల ప్రత్యేక అధికారులు, ఎపిడి, ఎంపిడిఓ లు, ఎం పి ఓ,లతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నర్సరీలు, వనమహోత్సవం, తదితర అంశాల పై అన్ని మండలాల ఎంపిడిఓ లు ఆయా మండలాల్లో సాధించిన లక్ష్యాల ను అడిగి తెలుసుకున్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను గడువు లోగా పూర్తి చేయాలనీ ఆదేశించారు. జిల్లాలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి, శ్రీనిధి ద్వారా అర్హత కలిగిన సంఘాలకు రుణాలనువచ్చే జనవరి 31 లోగా టార్గెట్ ప్రకారం రుణాలను పంపిణీ చేపట్టాలని తెలిపారు. లక్ష్యానికి అనుగుణంగా పంపిణీ చేయాలని తెలిపారు. అదే విధంగా రుణాల పంపిణీ తో పాటు రికవరీ వంద శాతం చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షించాలని, రికవరీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరాచాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో సాధించిన లక్ష్యాల ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, ఎల్డిఎం, ఏ పి డి, మండల ప్రత్యేక అధికారులు, తహాశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఏపిఓలు, ఏపిఎంలు, సిసిలు, ఎస్ బిఎం, టిఎలు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి మరో పేరు గుత్తా వెంకటేశ్వర్లు



**ఖమ్మం, జనవరి04( నినాదం న్యూస్) :** రఘునాధపాలెం మండలం, చిమ్మపూడి గ్రామంలో గత 8 సంవత్సరాలుగా సమాజ సేవ చేస్తూ గ్రామంలో ఎవరైనా నిరుపేదలు మరణిస్తే వారి కుటుంబాన్ని పరామర్శించి తన వంతు సహాయంగా 50 కేజీల బియ్యాన్ని అందిస్తున్న గుత్తా .వెంకటేశ్వర్లు
ఈ మధ్యనే స్వర్గస్తులైన గాడిచర్ల. రజిత గ కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందించిన ఖమ్మం జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మరియు చిమ్మపూడి గ్రామ మాజీ ఉపసర్పంచ్ గుత్తా. వెంకటేశ్వర్లు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తోపాటు గ్రామ పెద్దలు మాజీ వార్డ్ నెంబర్లు పాల్గొనడం జరిగింది ఎప్పుడు సహాయంకి ముందుండే గుత్తా సేవలను గ్రామ ప్రజలు అభినందించడం జరిగింది..

## మేయర్, కమిషనర్ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఉద్యోగులు

**కుత్బుల్లాపూర్, జనవరి 4 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, కమీషనర్ సాబెర్ అలిని మర్యాద పూర్వకంగా కలిసిన నూతనంగా నియమితులైన కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్స్,జూనియర్ అసిస్టెంట్స్,వార్డ్ ఆఫీసర్లు.ఈ సందర్భంగా మేయర్,కమీషనర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు వారికి అభినందనలు,శు భాకాంక్షలు తెలియజేశారు.



# వర్గీకరణతోనే నిమ్నజాతులకు రిజర్వేషన్ ఫలాలు



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** వర్గీకరణ జరిగినప్పుడే ఎస్సీ ఎస్టీలలో ఉన్ననిమ్నజాతులకు రిజర్వేషన్ ఫలాలు అంది అభివృద్ధిలో ముందు ఉంటారని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు పుట్ట రవి మాదిగ, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి చిత కృష్ణ పేర్కొన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని గ్రామపంచాయతీ సెమినార్ హాల్ లో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా స్థాయి సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాలలో దళిత గిరిజనుల సంక్షేమ అభివృద్ధి, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించాలని సుప్రీం కోర్టు ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ జడ్జిమెంట్ ఇచ్చిందన్నారు. దీనికి సానుకూలంగా ప్రభుత్వాలు ఉన్నా నేటికీ దాని కార్యచరణ రూపు దాల్చడంలేదన్నారు. వర్గీకరణ విషయంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని, ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ ప్రజా సంఘాలు, విద్యార్థులు ఎస్సీఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ కొరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో జనవరి 08న తలపెట్టిన సదస్సుకు ఆదివాసి ప్రజలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘం, విద్యార్థి సంఘం, మేధావులు తదితరులతో మంద కృష్ణ మాదిగ ఉద్యమానికి సంపూర్ణ మద్దతుతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు వట్టం జనార్ధన్, ఆదివాసీ నాయక పోఢ్ దెబ్బ జిల్లా ఇ%శీ%ఛార్జ్ గుర్రం రామన్న, నాయకపోఢ్ ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు దళిత రత్న నెమలి నర్సయ్యమాదిగ, జిల్లా సాధన సమితి జిల్లా అధ్యక్షులు ముంజల భిక్షపతి, నాయక పోఢ్ దెబ్బ విద్యార్థి విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇండ్ల సమ్మయ్య, నాయకపోఢ్ నియోజక వర్గ ఇంచార్జీ ఏర్ని ధనుంజయ, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి వజ్జ రాజు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఇరుగు పైడి పోడుదెబ్బ వాజేడు, వెంకటాపురం మండల అధ్యక్షులు బానారీ సమ్మయ్య నాయక పోఢ్ తుడుందెబ్బ ములుగు మండల నాయకులు కల్తి రంజిత్, వాసం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మరువలేనిది... ఇన్చార్జి డీఈవో హనుమంతు





**ధర్మారం జనవరి 4 (నినాదం న్యూస్)** మండల విద్యాధికారిగా గత ఎన్ని సంవత్సరాల నుండి పనిచేస్తూ ఎందరో అధికారుల ఉపాధ్యాయుల ప్రజాప్రతినిధుల చేత మన్నలను పొందిన పినమల్ల ఛాయాదేవి  పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి విద్యాధికారి హనుమంతు ఆమె సేవలను కొని ఆడారు. 1984 సంవత్సరంలో కేవలం 398 రూపాయలకు ఉపాధ్యాయ వృత్తి లోకి అడుగుపెట్టిన ఛాయాదేవి సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించి స్వతంత్ర సమరయోధుడైన తండ్రి శంకరయ్య ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివి మొదటగా ప్రాథమిక ఉపాధ్యాయురాలు జిల్లాలోని చందపల్లిలో తన ఉపాధ్యాయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయురాలిగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా అలాగే మండల విద్యాధికారిగా విద్యారంగంలో తినలేని సేవలను అందించండి అని ముఖ్యంగా విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఎంతగానో శ్రమించిన వ్యక్తి ఛాయాదేవి అని అన్నారు జూలపల్లి ధర్మారం ఉన్నత పాఠశాలలో నీ విద్యార్థిని విద్యార్థుల జీవితాల్లో చెరగని ముద్ర వేసిందని కెరియర్ గార్డెన్స్ ప్రేరణ తరగతులు వ్యక్తిత్వ వికాస శిక్షణ ఏర్పాటు చేసి విద్యార్థుల నో ప్రోత్సహించింది అన్నారు. మాకు ఎన్నికల నిర్వహణ వార్షికోత్సవాలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రదర్శింప చేసిందిఅన్నారు.

పర్యావరణ పరిరక్షణ భాగంగా నేషనల్ గ్రీన్ కోర్ కార్యక్రమంలో పరిసరాల పరిరక్షణ కాలుష్య నివారణ డెంగ్యూ నివారణ అంటువ్యాధుల నిర్మూలన వంటి అంశాలపై అనేక అవగాహన సదస్సుల ను నిర్వహించారు ముఖ్యంగా పాఠశాలల్లో ఉన్న విషయాలను నిజజీవితంలో వినియోగపడేలా అవగాహన కల్పించారని వీరి సేవలను గుర్తించి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఛాయాదేవికి గ్రీన్ కోర్ అవార్డు కూడా ఇవ్వటం జరిగిందని అన్నారు. మండల తహసిల్దార్ హరిపుద్దీన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో ప్రకటించిన పదో తరగతి జిపిఏ విధానంలో విద్యార్థుల ఉత్తమ విద్యను అందించి సామాన్య తరగతి విద్యార్థులను కూడా విమాన యానం చేసే అదృష్టాన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందింపజేశారని వందేమాతరం ఫౌండేషన్ నిర్వహణలో రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు తేవటం ఛాయదేవి కృషికి నిదర్శనమన్నారు.

ఎంత ఎదిగిన ఒదిగి ఉండే మనస్తత్వం గల ఛాయాదేవి తాను చేపట్టిన కార్యక్రమాలు అన్ని విజయవంతం కావడంలో తోటి ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు సమస్త కృషి మరువలేనిదని పేర్కొనడం ఛాయాదేవి గొప్పతనానికి నిదర్శనం అన్నారు.

ఆమె విశేష సేవలను గుర్తించి ఉమ్మడి కరీంనగర్ పెద్దపెల్లి జిల్లా స్థాయి అవార్డులు రావడం వారి కృషికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యా యి ని,ఉపాధ్యాయులు మాలతి లత మండల నోడల్ ఆఫీసర్ పోతూ ప్రభాకర్ డిప్యూటీ తాసిల్దార్ ఉదయ్ కుమార్ ఏఎంసీ చైర్మన్ లహరి వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వామన అవతారంలో భద్రాద్రి రాముడు

**భద్రాచలం,జనవరి 4 (నినాదం న్యూస్):** భద్రాచలంలోని రాములవారి ఆయంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సీతారామచంద్ర స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఐదో రోజైన శనివారం వామన అవతారంలో సీతారాములు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం మహానివేదన అనంతరం తిరువీధి సేవ నిర్వహించారు. కోలాట నృత్యాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ నేపథ్యంలో స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న గోదావరిలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. జనవరి 10న వైకుంఠ ద్వారం ద్వారా సీతారామచంద్ర స్వామి దర్శనమిస్తారు. దీంతో ఈ నెల 10వ తేదీ వరకు ఆలయంలో నిత్య కల్యాణాలను అధికారులు నిలిపివేశారు. కాగా, నాలుగో రోజైన శుక్రవారం నరసింహావతారంలో రామయ్య దర్శనమిచ్చారు. తొలుత స్వామివారిని ఆలయంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత నిత్యకల్యాణ మండపానికి తీసుకొచ్చారు.

## స్టూడెంట్స్‌కు
# స్టడీ మెటీరియల్ పంపిణీ



**మంగపేట, జనవరి 04 ( నినాదం న్యూస్ ) :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రానికి చెందిన జవంగుల రవీంద్ర శనివారం ఎగ్జామ్ ప్యాడ్లను, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జవంగుల రవీంద్ర మాట్లాడుతూ మంగపేట మాజీ సర్పంచ్ అయిన తన తండ్రి జవంగుల చంద్రశేఖర్ జ్ఞాపకార్థం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు పరీక్షల రాసుకునేందుకు అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్ లను, పెన్నులను, పెన్సిళ్లను, స్కేల్ లను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పొదెం మేనక, టీచర్లు, స్టూడెంట్లు పాల్గొన్నారు.

# మదర్సాలో భారీ బహిరంగ సభ

**కోదాడ, జనవరి 4 (నినాదం న్యూస్):** కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం లో గల మదీనా తుల్ ఉలూమ్ మదర్స స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా నేడు ఆదివారం సాయంత్రం భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు మదర్సా వ్యవస్థాపకులు మౌలానా అబ్దుల్ ఖాద్రి రషాది, మౌలానా అహ్మద్ నద్వి లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి తోపాటు పలువురు ఆధ్యాత్మిక గురువులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా మదర్సాలో చదివిన పూర్వ విద్యార్థులు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున హాజరుకావాలని వారు కోరారు......

## అందుబాటులోకి
# మృతదేహాల బాడీ ఫ్రీజర్లు




**8ఇంక్లైన్ కాలనీ, జనవరి 04, నినాదం న్యూస్.:** మృత దేహాలను ఉంచే బాడీ ఫ్రీజర్లు మరమ్మత్తు చేయించి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మూడు బాడీ ఫ్రీజర్లు వున్నప్పటికీ గత కొంతకాలంగా పని చేయడం లేదు. దీంతో అవసరమైన వారు ప్రయివేట్ వ్యక్తులను/ సంస్థలను ఆశ్రయిస్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని దృష్టికి వచ్చిన వెంటనే వాటిని మరమ్మత్తు చేయించి ఉపయోగంలోకి తీసుకువచ్చినట్లు కమిషనర్ తెలిపారు. బాడీ ఫ్రీజర్లు కావాలసినవారు ఆధార్ కార్డు , రేషన్ కార్డు , చిరునామా తదితర వివరాలు సమర్పించి ఉచితంగా తీసుకువెళ్లవచ్చని తెలిపారు. ఇట్టి సేవలు పొందడానికి ఫోన్ నెం 9603 666 444 , టోల్ ఫ్రీ నెంబర్ 18004257062 లను సంప్రదించాలని కోరారు.

నినాదం కథనానికి స్పందన...

## అల్లుకున్న మొక్కల తీగలను తొలగించిన అధికారులు



**కోదాడ, జనవరి 4 (నినాదం న్యూస్):** నినాదం కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. కోదాడ పట్టణంలోని త్రివేణి డిగ్రీ కళాశాల ఆవరణలో గల విద్యుత్ తీగల కు వివిధ తీగజాతికి చెందిన మొక్కలు పందిరి లాగా పెరిగే అల్లుకున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇదే విషయమై గత నెల డిసెంబర్ 30వ తారీఖున అల్లుకున్న నిర్లక్ష్యం అనే వార్తా కథనాని నినాదం ప్రచురించింది. ఈ కథనానికి ఎట్టకేలకు విద్యుత్ అధికారులు స్పందించి పందిరి లాగా అల్లుకున్న మొక్కలు తీగలను తొలగించారు.



## అంధకారంలో లేబర్ కార్యాలయం...

**-పది రోజుల నుండి కరెంటు లేక ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు**

**-చెల్లించాల్సిన బిల్లు కేవలం అంతేనా...?**




**కోదాడ, జనవరి 4(నినాదం న్యూస్):** గత పది రోజుల నుండి కోదాడ పట్టణంలోని లేబర్ కార్యాలయం అంధకారంలో ఉంది. విద్యుత్ బకాయి బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు కరెంట్ కట్ చేశారు. దీంతో చీకటి గదిలోనే ఉద్యోగులు తమ విధులు నిర్వర్తిస్తున్నారు. అదేవిధంగా వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చి వెళ్లేవారు సైతం విద్యుత్ లేకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని, చాలా పనులు పూర్తికాక వెను తిరుగుతున్నారు. ప్రస్తుతం అంతా డిజిటలైజేషన్ కావడంతో ప్రతిదీ ఆన్లైన్లో కంప్యూటర్ ద్వారా మాత్రమే చేయాల్సి ఉంది కానీ అధికారులు పవర్ లేదు చెబుతూ పని దాటవేస్తున్నారు. బకాయి చెల్లించవలసిన బిల్లు ఎంత అని చూస్తే కేవలం 1410 రూపాయలకు ప్రభుత్వ కార్యాలయంలోనే కరెంటు కట్ చేసిన తీరును చూస్తుంటే విద్యుత్ అధికారుల నిజాయితీ కనిపిస్తుందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు...

# నిర్మాణంలో నాణ్యత లోపాలను సరిచేయాలి



**చౌటుప్పల్, జనవరి4(నినాదంన్యూస్):** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డులో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాలలో నాణ్యత లోపాలను సరిచేయాలనిసిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి ,రాగిరి కృష్ణయ్య, ఎండి పాషా, గోశిక కరుణాకర్ డిమాండ్ చేశారు. ఇటీవల సర్వీస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ స్లాబు కూలిపోయిన ప్రదేశాలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణాలు నాణ్యత ప్రమాణాను పాటించకుండా నాసిరకంగా పనులు చేస్తున్నారన్నారు. చౌటుప్పల్ చెరువు నుండి అలుగు నీరు వెళ్లే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో నిర్మిస్తున్న డ్రైనేజీ నుండి వర్షాలు కురిసినప్పుడు వచ్చే వరదలకు సరిపోదని, ఈ డ్రైనేజీ వాటి విస్తరణ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు చౌటుప్పల్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ నాణ్యత ప్రమాణాలతో కూడిన నిర్మాణాలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ మీద వేసే స్లాబు చిన్న ఆటో వెళ్లిన బైక్లు వెళ్లిన కూలిపోయే పరిస్థితి ఉందని , డ్రైనేజీ మీద స్లాబ్ వేసి పది రోజులు కూడా కాకుండానే స్లాబ్ మూతలు పగిలిపోవడం ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరుగుతుందని ప్రజలకు ప్రమాదంగా మారాయని అన్నారు. ఈకార్యక్ర మంలో బత్తుల దాసు శ్రీనివాస్ రెడ్డి బత్తుల లక్ష్మయ్య గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి జటంగి కృష్ణ భావనలపల్లి స్వామి సోమరాజు బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ కు ఎంపిక



**నూతనకల్ జనవరి 4నినాదం న్యూస్:** మండల పరిధిలోని తాళ్ళసింగారం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పవన్ సూర్య అనే విద్యార్థి సోషల్ స్టడీస్ రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సోమయ్య గౌడ్ తెలిపారు. శనివారం సూర్యాపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి అభినందనీయమని విద్యార్థితో పాటు గైడ్ టీచర్ శోభన్ బాబు, అనిత ను అభినందించారు.

## మహా న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డి



**చౌటుప్పల్ జనవరి 4(నినాదం న్యూస్ )2025** నూతన సంవత్సర మహా న్యూస్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డి అనంతరం ఏసిపి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నిజాన్ని ప్రజలకు ,ప్రభుత్వానికి, అధికారులకు మధ్య వారధిగా ఉండి నిష్పక్షపాతంగా వార్తలు ప్రదర్శిస్తున్న మహా న్యూస్ యాజమాన్యానికి, సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ మునుముందు కూడా వారు ఇలాంటి వార్తలని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపిన ఎసిపి మధుసూదన్ రెడ్డి, ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సర్కిల్ ఇన్స్పెక్టర్ మన్మథ కుమార్ ,ఎస్సై యాదగిరి గౌడ్, పోలీస్ సిబ్బంది , మహా న్యూస్ రిపోర్టర్ కనకమోని శ్రీనివాస్, యాదగిరి ,మల్లేష్, నరేష్,రాజేష్ , సాయిలు తమ్మకొండ శ్రీను , పలువురు విలేకర్లు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత పై అవగాహన సదస్సు



**కోదాడ, జనవరి 4 (నినాదం న్యూస్):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని నల్లబండగూడెం వద్ద గల అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్పోస్ట్ ఆవరణలో వాహనదారులకు ఎం వి ఐ రాజ్ మహమ్మద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటో డ్రైవర్లు, పాఠశాలల బస్సుల డ్రైవర్లు, వివిధ వస్తువులను రవాణా చేసే వాహనాల డ్రైవర్లు తమ విధి నిర్వహణలో రోడ్డు భద్రత నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు అదేవిధంగా ప్రతి ఒక్క వాహనదారుడు తమ వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను ఎప్పుడూ తమ వెంటే ఉంచుకోవాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలను సక్రమంగా పాటించడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదాల బారి నుండి రక్షించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వాహనాల డ్రైవర్లచే భద్రత నిబంధనలను పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ సాయి ప్రసాద్ కానిస్టేబుళ్లు చిన్ని బాబు దేవేందర్ జానకిరామ్ హోంగార్డు కొండలు సిబ్బంది సైఫుద్దీన్ రాజకుమార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జగదీష్ ను సన్మానించిన ఆలయ కమిటీ చైర్మన్ ఊరే లక్ష్మణ్



**చింతపల్లి, జనవరి 4 (నినాదం న్యూస్)** మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని వి.టి. నగర్ లో ఉన్న శ్రీ సంతోషిమాత ఆలయ అభివృద్ధిలో భాగంగా భూరి విరాళం అందజేసిన కొమిరిశెట్టి జగదీష్ ను శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఊరే లక్ష్మణ్ శనివారం ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా కొమిరిశెట్టి జగదీష్ తన తండ్రి యాదయ్య జ్ఞాపకార్థం ఆలయానికి 85 వేల రూపాయల వ్యయంతో ఇనుముతో తయారుచేసిన గ్రిల్లు ను విరాళంగా అందజేయడం పట్ల చైర్మన్ లక్ష్మణ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన జగదీష్ కుటుంబ సభ్యులను అభినందిస్తూ జగదీష్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాల రంగాచారి, మాస భాస్కర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పనీర్ గోల్కొండ



ప్యాన్‌లో పనీర్ క్యూబ్స్ వేసి అందులోకి పచ్చిమిర్చి పేస్ట్, అల్లం-వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, గరం మసాలా పౌడర్, కొత్తిమీర, పెరుగు, ఉప్పు కలిపి మారినేట్ చేసుకోవాలి.

పనీర్ గోల్కొండ

కావాలసిన పదార్థాలు: పనీర్- 500 గ్రాములు(2 ఇంచ్ క్యూబ్స్‌గా కట్ చేసుకోవాలి), పచ్చిమిర్చి పేస్ట్- 1 టీస్పూన్(సుమారు ఆరేడు పచ్చిమిర్చి తీసుకుంటే సరి), అల్లం, వెల్లుల్లి పేస్ట్- 1 టీస్పూన్, నిమ్మరసం- 1 టీస్పూన్, గరం మసాలా పౌడర్- 1 టీస్పూన్, పెరుగు- అరకప్పు, తాజా కొత్తిమీర ఆకులు- అరకప్పు, ఉప్పు- రుచికి తగినంత, క్రీమ్- గార్నిషకోసం, వెన్న- గార్నిషింగ్‌కి సరిపడ

తయారీ విధానం: ప్యాన్‌లో పనీర్ క్యూబ్స్ వేసి అందులోకి పచ్చిమిర్చి పేస్ట్, అల్లం-వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, గరం మసాలా పౌడర్, కొత్తిమీర, పెరుగు, ఉప్పు కలిపి మారినేట్ చేసుకోవాలి. మిశ్రమం అంతా పట్టేంత వరకూ ఉంచి వీటిని స్కీవర్స్‌కి గుచ్చాలి. వీటిని మట్టి ఓవెన్ మీద కుక్ చేయాలి. ఆ తర్వాత పన్నీర్ ముక్కలను వెన్న తర్వాత క్రీమ్‌తో బ్రష్ చేయాలి. చపాతిలోకి తినొచ్చు. లేదా స్నాక్‌లా పనీర్ ముక్కలను లాగించేయచ్చు.

# సగ్గుబియ్యం దోశలు

ముందుగా సగ్గుబియ్యాన్ని కడిగి గంటన్నర పాటు నానబెట్టుకోవాలి. తరువాత మిక్సీలో వేసి మెత్తగా పట్టుకుని బౌల్‌లోకి తీసుకోవాలి.

కావలసినవి:
సగ్గుబియ్యం - ఒక కప్పు, బొంబాయి రవ్వ - అరకప్పు, పెరుగు - మూడు టీస్పూన్లు, ఉల్లిపాయ - ఒకటి, కొత్తిమీర - ఒకకట్ట, ఉప్పు - తగినంత, జీలకర్ర - అర టీస్పూన్, కరివేపాకు - రెండు రెమ్మలు, పచ్చిమిర్చి - నాలుగు.

తయారీ విధానం:
ముందుగా సగ్గుబియ్యాన్ని కడిగి గంటన్నర పాటు నానబెట్టుకోవాలి.
తరువాత మిక్సీలో వేసి మెత్తగా పట్టుకుని బౌల్‌లోకి తీసుకోవాలి. తరువాత అందులో బొంబాయి రవ్వ, పెరుగు వేసి బాగా కలపాలి. కొద్దిగా నీళ్లు వేసి చిక్కటి పిండిలా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని పావుగంట పాటు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో జీలకర్ర, కొత్తిమీర, కరివేపాకు, సన్నగా తరిగిన ఉల్లిపాయ, దంచిన పచ్చిమిర్చి, రుచికి తగిన ఉప్పు వేసి బాగా కలియబెట్టాలి. మిశ్రమం మరీ పలుచగా, మరీ చిక్కగా కాకుండా చూసుకోవాలి.
స్టవ్‌పై పాన్ పెట్టి కొద్దిగా నూనె వేసి, పాన్ అంతటా రాసి మిశ్రమాన్ని దోశలా పోసుకోవాలి. చిన్నమంటపై కాల్చుకోవాలి. ఒకవైపు కాలిన తరువాత మరోవైపు తిప్పి కాల్చుకోవాలి. బ్రేక్‌ఫాస్ట్‌లోకి ఈ దోశలు సర్వ్ చేసుకోవచ్చు.





# సాబుదానా థాలీ పీట్

సగ్గు బియ్యాన్ని శుభ్రంగా కడిగి రాత్రంతా నానబెట్టుకోవాలి. బంగాళదుంపలను ఉడికించి, పొట్టుతీసి గుజ్జుగా చేసుకోవాలి. పల్లీలను వేయించి పొడి చేసుకోవాలి.

కావలసినవి:
సగ్గుబియ్యం - ఒకటిన్నర కప్పు, బంగాళదుంపలు - రెండు, జీలకర్ర - అర టీస్పూన్, పల్లీలు - నాలుగు టేబుల్‌స్పూన్లు, అల్లం - చిన్నముక్క, కొత్తిమీర - ఒక కట్ట, నిమ్మరసం - ఒకటీస్పూన్, పంచదార - ఒక టీస్పూన్, ఉప్పు - తగినంత, నూనె - తగినంత.

తయారీ విధానం:

సగ్గు బియ్యాన్ని శుభ్రంగా కడిగి రాత్రంతా నానబెట్టుకోవాలి. బంగాళదుంపలను ఉడికించి, పొట్టుతీసి గుజ్జుగా చేసుకోవాలి.పల్లీలను వేయించి పొడి చేసుకోవాలి. ఉదయాన్నే సగ్గుబియ్యంలో నీళ్లన్నీ తీసివేసి బంగాళదుంపల గుజ్జు వేసి కలుపుకోవాలి. జీలకర్ర, పల్లీల పొడి, అల్లం, కొత్తిమీర, పంచదార, నిమ్మరసం, తగినంత ఉప్పు వేసి మరోసారి కలుపుకోవాలి.స్టవ్‌పై పాన్ పెట్టి ఒక చెంచా నూనె వేసి పాన్‌పై సమంగా అంటేలా రాయాలి. అర చేతులకు కొద్దిగా నూనె రాసుకుని మిశ్రమాన్ని కొద్దిగా చేతుల్లోకి తీసుకుంటూ థాలీ పీట్‌లు ఒత్తుకోవాలి.వీటిని పాన్‌పై వేసి రెండు వైపులా కాల్చుకోవాలి. పాన్ పెద్దగా ఉంటే ఒకేసారి రెండు మూడు థాలీ పీట్‌లు వేసి కాల్చుకోవచ్చు. చట్నీ లేదా టొమాటో కెచప్‌తో సర్వ్ చేసుకుంటే ఇవి చాలా రుచిగా ఉంటాయి.

# శ్రీదేవికి తగ్గ వారసురాళ్లు



అతిలోక సుందరి శ్రీదేవితోపాటు ఆమె కూతుళ్లకూ స్టయిలిస్ట్‌గా పనిచేయడం.. తన వృత్తిజీవితానికి పరిపూర్ణత తీసుకొచ్చిందని అంటున్నది బాలీవుడ్ టాప్ స్టయిలిస్ట్ తాన్య ఘావ్రీ ఒకే కుటుంబానికి చెందిన రెండు తరాలను మరింత అందంగా చూపించడం.. తన కెరీర్‌లోనే గొప్ప విషయమని చెప్పుకొచ్చింది. శ్రీదేవికి స్టయిలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన తాన్య.. ఇప్పుడు జాన్వీకపూర్, ఖుషీకపూర్ కోసం కూడా పనిచేస్తున్నది. ఇటీవల ఓ యూట్యూబ్ చానెల్‌తో మాట్లాడుతూ.. శ్రీదేవి కుటుంబంతో తనకున్న అనుభవాలను పంచుకున్నది.

'శ్రీదేవి దగ్గర స్టయిలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించినప్పుడు నేను చాలా చిన్నదాన్ని. ఆమె నన్ను చాలా ప్రేమగా చూసేవారు. ఫ్యాషన్‌రంగం, కెరీర్‌కు సంబంధించిన అనేక విషయాలను ఓపికగా చెప్పేవారు' అంటూ శ్రీదేవితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నది తాన్య. ఇక జాన్వీ-ఖుషీ గురించి చెబుతూ.. వారిద్దరి స్టయిల్ వారి తల్లినే పోలి ఉంటుందని చెప్పుకొచ్చింది. ఖుషీ చాలా ఇన్‌పుట్స్ ఇస్తే.. జాన్వీ సృజనాత్మకంగా ఆలోచిస్తుందనీ అంటున్నది.

వయసులో చిన్నవారే అయినప్పటికీ.. ఫ్యాషన్‌రంగంపై వారికి మంచి పట్టుందనీ, తమ తల్లిలాగే అన్ని విషయాలపైనా శ్రద్ధ చూపుతారని చెబుతున్నది. ఇక, బాలీవుడ్‌లో టాప్ స్టయిలిస్ట్ అయిన తాన్య.. మాజీ టెస్ట్ క్రికెటర్ కర్షణ్ ఘావ్రీ కూతురు. ముంబయిలో పుట్టిపెరిగింది. న్యూయార్క్‌లో ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిగ్రీ చేసింది. భారత్‌కు తిరిగొచ్చాక బాలీవుడ్ సెలెబ్రిటీ స్టయిలిస్ట్‌గా కొనసాగుతున్నది.

సోయగం
Soyagam